సానుకూలంగా

# సమరబాట

❖ తమ్ముళ్లకు బాబు దిశానిర్దేశం
❖ అయిదుగురి బృందం నియామకం

న్యూస్‌టుడే, శ్రీకాకుళం



**"మనకు రాజకీయ శత్రువులు ఎవరూ లేరు. ప్రజా సమస్యలు.. విధానాల విషయంలోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ను వ్యతిరేకించాం. టెక్కలి ఉప ఎన్నికల్లో వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి సానుకూల దృక్పథంతో ముందుకు సాగండి"**

**–తెదేపా అధినేత చంద్రబాబునాయుడు**

రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు శనివారం పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. టెక్కలి ఉప ఎన్నికల్లో ప్రచారం తీరు ఎలా ఉండాలనే దానిపై నేతలకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రచారం విషయంలో వైఎస్‌పై వ్యక్తిగత విమర్శలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కొన్ని ప్రశ్నలతో కూడిన రెండు ఫారాలు టెక్కలి పంపిస్తున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు గ్రామాల వారీగా, బూత్‌లవారీగా మనకు ఎన్ని ఓట్లు రావచ్చు, చనిపోయిన ఓటర్ల వివరాలు పంపించాలని సూచించినట్లు తెలిసింది. టెక్కలి ఉప ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి అయిదుగురు ఎమ్మెల్యేలతో కూడిన బృందాన్ని నియమించారు. ఇందులో ఎమ్మెల్యేలు రావుల చంద్రశేఖర రెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, కేశవ్, ధూళిపాళ్ల నరేంద్ర సభ్యులుగా ఉన్నారు. వీరంతా ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని చెప్పినట్లు సమాచారం. టెక్కలి నియోజకవర్గంలో పనిచేస్తున్న బూత్ కమిటీలు, మండల కమిటీల సభ్యులుగా ఉన్న 230 మంది చంద్రబాబు నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.